క్లుప్తంగా

వేమిరెడ్డికి సత్కారం



నెల్లూరు(సెంట్రల్): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు శుక్రవారం సత్కరించారు. పార్టీ నేతలు కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

నెలవంక దర్శనంతో సంబరాలు



నెల్లూరు(బృందావనం): నెలవంక దర్శనంతో జెండావీధిలోని మసీదు వద్ద సంబరాలను జరుపుకొన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మీరా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మున్వర్, ముస్లిం సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఖాలిద్, మైనార్టీ నేతలు మున్వర్, ముజాహిద్, తదితరుల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. మిఠాయిలను పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

కళాత్మక శుభాకాంక్షలు



నెల్లూరు(బృందావనం): హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు పద్మారత్నం ఈద్ - ఉల్ - ఫిత్ర్ శుభాకాంక్షలను కళాత్మకంగా తెలిపారు. ఎండు ఆకుపై కార్వింగ్‌తో మసీదు, దువా చేస్తున్న భక్తుడి చిత్రాన్ని తీర్చిదిద్దారు.

అటవీ శాఖలో ఇద్దరి సస్పెన్షన్

నెల్లూరు(బారకాసు): జిల్లా అటవీ శాఖ కావలి డివిజన్ పరిధిలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. అటవీ శాఖ కావలి రేంజ్ పరిధిలో చాకచర్ల సెక్షన్‌కు సంబంధించిన పెద్దవరం ఇన్‌చార్జి, కుల్లూరుపాడులో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న విశాఖబాబు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వరిస్తున్న బ్రహ్మనాయుడు విధుల్లో నిర్లక్ష్యం వహించారు. అటవీ భూముల ఆక్రమణ, జామాయిల్ చెట్లు పడిపోయిన విషయం తెలిసినా సంబంధిత అధికారులకు సమాచారమివ్వకుండా నిర్లక్ష్యం వహించారనే కారణంతో సస్పెండ్ చేశారు.

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సర విద్యార్థిని మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణయాదవ్ కోరారు. ఈ మేరకు జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. సంఘ జిల్లా కన్వీనర్ సుధీర్‌యాదవ్, నేతలు మహేష్, సాయి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



కోవూరు: జిల్లా నూతన ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డిని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎస్పీ బంగ్లాలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు ఉన్నారు.

విఘ్నేశ్వరుడికి పంచలోహ కవచం బహూకరణ

మనుబోలు: స్థానిక విఘ్నేశ్వరాలయంలోని వినాయకుడికి పంచలోహ కవచాన్ని గ్రామానికి చెందిన పెనుగొండ సుధాకర్, శాంతి దంపతులు శుక్రవారం బహూకరించారు. అర్చకుడు సాయకుమార్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించి విఘ్నేశ్వరుడికి కవచాన్ని అమర్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తమ ప్రభుత్వంలో ఏమి అభివృద్ధి చేశామనే అంశంపై త్వరలో అందరికీ సమాధానాన్ని చెప్తామని.. అవసరమైతే చర్చకూ సిద్ధమని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 50వ డివిజన్లో గల సంతపేట, మార్కెట్ సెంటర్, సుదర్శనం వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఇంటింటికీ వెళ్లి ఆరా తీసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికలకు ఆర్నెల్ల ముందు హడావుడిగా గుంతలను తవ్వి రోడ్లు వేయడం మినహా గత ప్రభుత్వం చేసిందేమీలేదని విమర్శించారు. నాసిరకంగా వీటిని నిర్మించడంతో పలు ప్రాంతాల్లో కుంగిపోయిన అంశాన్ని గుర్తుచేశారు. సంతపేట మార్కెట్‌ను సగం నిర్మించి వదిలేశారని, దీన్ని మొత్తం తొలగించి నిర్మించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో నగరంలోని హరనాథపురం జంక్షన్లో ఫ్లైఓవర్ నిర్మాణం దాదాపు పూర్తవుతోందని, ఈ విషయం తెలిసీ కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కరోనా సమయంలో ఇంటి నుంచి బయటకు కదలని వ్యక్తులూ ప్రస్తుతం ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పెన్నా బ్యారేజీని పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. మైపాడు రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ జయలక్ష్మి, ఏపీ అగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 45వ డివిజన్లో గల శ్రీనివాసాగ్రహారం, గచ్చుకాలువ ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.65 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీనివాసాగ్రహారం - రామ్మూర్తినగర్ మధ్య గచ్చుకాలువపై 3, 4వ వీధులను కలుపుతూ నిర్మించిన కల్వర్టు, సీసీ రోడ్డును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నా రు. కార్పొరేటర్ వేదవతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణకు సహకరించాలి



ప్రక్రియను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శోధన్‌నగర్ మస్టర్ పాయింట్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలోని పారిశుధ్య సిబ్బంది హాజరును పరిశీలించారు. ఏసీ కూరగాయల మార్కెట్, రామలింగాపురం ప్రధాన మార్గం, మాగుంట లేఅవుట్, ముత్యాలపాళెం, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై సమాచారమిస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఏసీ మార్కెట్ బయట రోడ్డు మార్జిన్లో కూరగాయలను విక్రయించే వారు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉదయం 6.30కు పరిసరాలను ఖాళీ చేయాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు నిరంతరం సరఫరా అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

క్రమశిక్షణతో మెలగాలి

నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు విధుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరంలోని 28 / 1, 2, 3.. న్యూ మిలటరీ కాలనీ 1, 2 వార్డు సచివాలయాలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపులపై ఐదు శాతం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు.

ఏసీ స్టేడియంలో క్రీడా సంబరాలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడా సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి మహేశ్వరుడు మాట్లాడారు. క్రీడా సంబరాలతో పశు వైద్యులు, వారి కుటుంబ సభ్యులకు మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళా డాక్టర్లు, పిల్లలకు క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలను ఆయన ప్రారంభించారు. షటిల్, వాలీబాల్, రన్నింగ్ రేస్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. డాక్టర్ వసంతరాయులు, ఉప సంచాలకులు సురేష్, డాక్టర్ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని నెల్లూరు క్లబ్‌లో జిల్లా క్యారమ్స్ ర్యాంకింగ్ టోర్నీ, క్లబ్ సభ్యులకు ప్రత్యేక టోర్నీని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సీనియర్ అడ్వొకేట్ మలిరెడ్డి శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఇసనాక సునీల్‌రెడ్డి హాజరయ్యారు. క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, కార్యదర్శి శ్రీధర్, సీనియర్ న్యాయవాది కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం



నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో వార్షికోత్సవ సంబరాలను శుక్రవారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కళాశాల అభివృద్ధి, సాధించిన విజయాలను ప్రిన్సిపల్ సుధాకర్‌రావు తెలియజేశారు. వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

అశ్వవాహనంపై భగవద్రామానుజాచార్యులు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అశ్వవాహనంపై శుక్రవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తగా వెంకటశేషయ్య వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

ప్రతిష్టాత్మకంగా బ్రహ్మోత్సవాల నిర్వహణ



నెల్లూరు రూరల్: రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వచ్చే నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను వేడుకగా జరపాలని ఆర్డీఓ మలోల సూచించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎంతో విశిష్టత కలిగిన ఉత్సవాలను విజయవంతం చేసేలా అధికారులు, దేవదాయ సిబ్బంది కృషి చేయాలని కోరారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జేసీ కూర్మనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌ను సుఖసంతోషాలతో జరుపుకోవాలి

నెల్లూరు(బృందావనం): రంజాన్‌ను ముస్లింలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కాంక్షించారు. ఈద్ - ఉల్ - ఫిత్ర్ శుభాకాంక్షలను ఆయన తెలియజేశారు.

నెల్లూరు(మినీబైపాస్): ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలను కలెక్టర్ హరినారాయణన్ తెలియజేశారు.

కవి గోపాలరావు సంస్మరణ సభ

నెల్లూరు(బృందావనం): సిండికేట్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్, కవి గోపాలరావు సంస్మరణ సభను రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని వెంకటేశ్వర విద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కవి పెరుగు రామకృష్ణ, నరేంద్రబాబు, శివకుమార్, శ్రీధర్‌బాబు, రఘు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ..



నెల్లూరు(బృందావనం): శ్రీహరికోట నుంచి చేపట్టనున్న పీఎస్ఎల్వీ – సీ 55 రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన వృత్తి నైపుణ్యంతో కొయ్య ముక్కలతో రాకెట్ నమూనాను తీర్చిదిద్దారు. ఎనిమిది అంగుళాల పొడవు, మూడంగుళాల వెడల్పుతో రాకెట్ నమూనాను రూపొందించానని చెప్పారు.

సీతారామపురం తహసీల్దార్ బదిలీ

నెల్లూరు(అర్బన్): సీతారామపురం తహసీల్దార్ శ్యామసుందరరాజును విడవలూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు.

సీఎండీని కలిసిన విద్యుత్ అధికారులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావును తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో జిల్లా విద్యుత్ అధికారులు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఎస్ఈ వెంకటసుబ్బయ్య నేతృత్వంలో అధికారులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, శేషాద్రి, బాలచంద్ర, శ్రీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్, వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కోటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై ఆయన సమీక్షించారు. వేసవిలో తాగునీటి సరఫరా, జగనన్న శాశ్వత భూ హక్కు పథకం, రీ సర్వే విధానం క్లీన్ ఆంధ్రప్రదేశ్, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు కమిషనర్ వికాస్ మర్మత్, ఆరోగ్యాధికారి వెంకటరమణ, ఈఈ సంజయ్, డీఈ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటరీ ఫిల్మ్‌కు నటీనటులకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): జగనన్న కంటి వెలుగు డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో నటించేందుకు నటీనటులను ఆహ్వానిస్తున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుబేదారుపేటలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను 30 నిమిషాల నిడివిలో చిత్రీకరించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రభాకర్, మోహన్ పాల్గొన్నారు.

హక్కులను సాధించుకోవాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మైనార్టీలు తమ హక్కులను ఆవాజ్ ద్వారా సాధించుకోవాలని చెన్నైకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ ఖాజారసూల్ పేర్కొన్నారు. రంజాన్ ప్రత్యేక సంచికను నగరంలోని ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఆవాజ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు రఫీ, రషీద్, రియాజ్, చాన్‌బాషా, ఫయాజ్, సర్దార్ అహ్మద్, గౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్‌చార్జి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు మృతి



నెల్లూరు రూరల్: గుడిపల్లిపాడులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న షణ్ముఖం (46) శుక్రవారం మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన షణ్ముఖం కొంత కాలంగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో దుకాణం వద్ద కుర్చీలో తెల్లవారుజామున కూర్చుంటూ వెనుకకు పడ్డారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఘటనపై పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.